క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని తోటపాలెంలో గల 33 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో బాలాజీనగర్, కేవీ నాయుడుకాలనీ, బ్యాంక్ కాలనీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి..



మాట్లాడుతున్న ట్రైనర్ శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) ట్రైనర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో ఈఎంటీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 12 సంవత్సరాలలోపు పిల్లల ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ, అపస్మాకర స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేయు విధానం, 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్స్ అవనాపు సాయి షణ్ముక్, రవికుమార్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అవగాహన



ఒకేషనల్ బైబుల్ స్టడీ అవగాహన సదస్సులో పాల్గొన్న చిన్నారులు

విజయనగరం: నగరంలోని రెవెన్యూ కల్యాణ మంటపం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'వన్ మైటీ గాడ్' అంశంపై అవగాహన కార్యక్రమం ముగిసింది. నిజమైన దేవుడు ఏసు ప్రభువు పేరిట ఒకేషనల్ బైబుల్ స్టడీపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 600 మంది చిన్నారులు పాల్గొన్నారు. రివైవల్ టాబెర్నాకల్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఆన్‌రూట్ దాసరి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో చిన్నారలకు క్రాఫ్ట్లు, పప్పెట్ షో, యాక్షన్ సాంగ్స్, డ్రాయింగ్, డ్రామా, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం



మహిళలకు మంజూరు పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: మహిళ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండవెలగాడలో వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల మంజూరు పత్రాలను డ్వాక్రా మహిళలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో మొత్తం 63 సంఘాలకు గానూ రూ.34,64,842 నిధులు మంజూరయ్యాయన్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ రోడ్డు, సారిక సమీపంలో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పీవీజే చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్వామివారికి స్నపనం, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమోదం

- పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు మంజూరు
- మహిళా పార్కులోకి ప్రవేశ రుసుం రూ.10గా నిర్ణయం
- 15 అంశాలతో కూడిన అజెండాను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్
- మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం



సమావేశంలో పాల్గొన్న నగర మేయర్ విజయలక్ష్మి, అధికారులు

విజయనగరం: నగర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అందులోభాగంగానే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకవర్గ అత్యవసర సమావేశం మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 15 అంశాలతో కూడిన అజెండాకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు సమావేశాన్ని ప్రారంభించగా ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ ప్రతిపాదిత అంశాలను సమర్థిస్తూనే, అధికారులు మరింత చురుకైన పాత్రను పోషించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. కోటీ 60 లక్షల రూపాయలతో కేఎల్ పురంలో 500 కేఎల్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సమావేశం ఆమోదం తెలిపింది. అలాగే 80 లక్షల రూపాయలతో ద్వారపూడి వద్ద గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మించడానికి.. 82 లక్షల రూపాయలతో బీసీ కాలనీలో మంచినీటి సదుపాయం కల్పనకు.. ఇంటింటికి చెత్త బుట్టలు ఏర్పాటు చేయుటకు సభ ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, 15 అంశాలకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలపడం హర్షదాయకమన్నారు. గతంలో తాగునీటికి ప్రజలు అల్లాడిపోయేవారని.. కాని ప్రస్తుత ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ముందస్తు ఆలోచనలతో రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరుగుతోందన్నారు. నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. పచ్చదనాన్ని పెంచి పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనల మేరకు నగర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ నుంచి నగరానికి 30 ఏళ్ల పాటు తాగునీటి సరఫరాకు అమృత్ పథకంలో భాగంగా 63 కోట్ల రూపాయలు మంజూరు కావడానికి కృషి చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేసి కార్పొరేషన్ స్థాయికి తగ్గ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. త్వరలో కొత్తపేట నీళ్లట్యాంకు వద్ద మరో ఫుడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు మాట్లాడుతూ, తమ డివిజన్ పరిధిలో ఉన్న మహిళా పార్క్ నిర్వహణకు 14 మందితో కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పార్కు నిర్వహణకు 10 రూపాయల ప్రవేశ రుసుం ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, వివిధ డివిజన్ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్

పూర్తి వేతనాలు చెల్లించాలి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట క్లాప్ డ్రైవర్ల ధర్నా

విజయనగరం: క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న క్లాప్ డ్రైవర్లకు పూర్తి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వం క్లాప్ డ్రైవర్లకు రూ.12,500 వేతనం ఇస్తుండగా.. మధ్యలో ఉన్న కాంట్రాక్టర్లు పది వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంటురోగాలు వ్యాపించే అవకాశం ఉన్నా.. ఎంతో ధైర్యంతో చెత్తను సేకరించి తరలిస్తున్న డ్రైవర్ల శ్రమను కొంతమంది కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని చెప్పారు. డ్రైవర్లకు ఈఎస్‌ఐ కార్డులు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కనీస మౌలికావసరాలైన వారంతపు సెలవులు, 8 జాతీయ, పండుగ సెలవులు, 15 సంపాదిత సెలవులు, పనిగంటలు ఇంతవరకు అమలు కాలేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల అశోక్, సహాయ కార్యదర్శులు ఎ.శ్రీనివాస్, కె.రవి, కోశాధికారి ఆర్.సౌరితో పాటు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్లో 60 సచివాలయ పరిధిలో పని చేస్తున్న డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి

- పర్యావరణ ఇంజినీర్ సుదర్శనం



పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ ఇంజనీర్ టి.సుదర్శనం తెలిపారు. మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా వీటీ అగ్రహారంలోని ఏపీఐఐసీ జిల్లా కార్యాలయం వద్ద బుధవారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణానికి ముప్పు కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాలని, ఈ వేస్ట్‌ను తగ్గించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యానికి మొక్కలు నాటే కార్యక్రమం ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. రైతులు సేంద్రియ సాగు విధానంపై మొగ్గు చూపాలని కోరారు. భావితరాల మేలు కోసం నీటి వనరులు, అడవుల సంరక్షణకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సి.యతిరాజు, పలువురు పారిశ్రామికవేత్తలు, పీసీబీ, ఏపీఐఐసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: ప్రజా సంక్షేమ పాలన అందించడంలో రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొండరాజుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు, తదితరులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకూ ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలు, వాటి ద్వారా కలిగిన ప్రయోజనాలను వివరించి, వివరాలతో కూడిన పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పొదుపు సంఘాల మహిళలకు విడితల వారీగా రుణమాఫీ డబ్బులను వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేసి వారిని ఆర్థికంగా ఆదుకున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తునారని తెలిపారు.

వలంటీర్లకు సన్మానం..

మోపాడ సచివాలయం పరిధిలోని సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారం పొందిన వలంటీర్లను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు సత్కరించారు.

కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ సరగడ కల్యాణి, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సరగడ బంగారురెడ్డి, అధికారులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

గుర్ల: రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కా రం చూపేవిధంగా రెవెన్యూ అధికారులు భూ రీసర్వే పనులు చేయాలని జేసీ మయూరి అశోక్ అన్నారు. మండల కేంద్రంలో భూ రీసర్వేను బుధవారం అయన పరిశీలించారు. సర్వే లో తలెత్తే చిన్నచిన్న సమస్యలను వెంటనే పరి ష్కరిస్తూ, సర్వేను వేగవంతం చేయాలని సి బ్బందిని ఆదేశించారు. ఏకకాలంలో భూసర్వే తో పాటు రికార్డుల పరిశీలన చేస్తేనే సర్వేత్వర గా పూర్తవుతుందని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆయన వెంట ఆర్డీఓ అప్పారావు, తహసీల్దార్ సూర్యనారాయణ ఉన్నారు.

నాలుగేళ్లలో మెరుగైన పాలన

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ డీవీజీ



డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో ఎంతో మెరుగైన పాలన అందించారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీ జీ శంకరరావు అన్నారు. పాలనాపగ్గాలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆశలు, ఆకాంక్షలు, అవసరాలను గుర్తిస్తూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో రూపొందించి అమలు చేయడం గొప్ప విషయమన్నారు. పాలనలో పూర్వానుభవం లేకపోయినా, యువనేతగా జగన్ మోహన్‌రెడ్డి మంచి విజ్ఞత కనబరుస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథం వైపు తీసుకెళ్తున్నాడనని చెప్పారు. నాలుగేళ్లలో సగభాగం కరోనా దుష్ప్రభావాన్ని తట్టుకుంటూ నిలబడడం ఆయన పాలనా దక్షతకు నిదర్శనమన్నారు. సచివాలయలు, కొత్త జిల్లాల ఏర్పాటు వంటి వినూత్న ఆలోచనలో మెరుగైన ఫలితాలు వచ్చాయని చెప్పారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పలు రాష్ట్రాలు మన రాష్ట్రంలోని పాలనా విధానాలను మెచ్చుకోవడం గొప్ప విషయమన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేటలో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. గ్రామానికి చెందిన దివంగత బడుకొండ అప్పలనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు సురేష్‌కుమార్, రామ్మోహన్ (చిన్న) ఆర్‌ఓ ప్లాంట్ భవనాన్ని నిర్మించి ఇచ్చారు. ఇందులో విజయనగరం సెంట్రల్ రోటరీ క్లబ్ సహకారంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బడుకొండ లక్ష్మి, సర్పంచ్ పైల ముత్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాము నాయుడు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సరఫరాకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయా మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టాలని డీఈ వైకుంఠనాయుడిని ఆదేశించారు. గ్రామాల్లోని చెరువులు కబ్జా గురవడంతో ఉపాధిహామీ పనులు జరగడం లేదని చింతపల్లి సర్పంచ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే ఆక్రమణలను తొలగించి పనులు చేపట్టాలని ఆదేశించారు. సీహెచ్ అగ్రహారం, అల్లాడపాలెంలో చేసిన ఉపాధి హామీ మెటీరియల్ పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాలేదని వైస్ ఎంపీపీలు ఎస్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్ ఎమ్మెల్యేకు తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందిస్తూ, త్వరలోనే బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. లంకలపల్లిపాలెంలో తాగునీటి బోరు మంజూరు చేయాలని సర్పంచ్ రౌతు వెంకటరత్నం కోరారు. పూసపాటిరేగ ఎస్సీ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో అంధకారంలో గడుపుతున్నామని సర్పంచ్ సీతారాం తెలిపారు. విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ, రెండు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న రైల్వే డీఎస్పీ బి.మోహనరావు

విజయనగరం క్రైమ్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఉన్న జీఆర్‌పీ స్టేషన్‌ను రైల్వే డీఎస్పీ బి. మోహనరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైళ్లల్లో గస్తీ పక్కాగా నిర్వహించాలన్నారు. నిషేధిత వస్తువులు రవాణా చేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

విజయనగరం పూల్‌బాగ్: పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని నెల్లిమర్ల మండలం అలుగోలు బీసీ వసతి గృహ విద్యార్థి చందక మన్మధరావుకు (575 మార్కులు) విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణుగోపాలకృష్ణ, తదితరులు బుధవారం సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఎం.యశోధనరావు, ఏబీసీడబ్ల్యూ (అర్బన్) బీవీ రమణ, వార్డెన్ పతివాడ కన్నంనాయుడు, విద్యార్థి తండ్రి చందకస్వామినాయుడు పాల్గొన్నారు.



చందక మన్మధరావును సత్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

వలంటీర్ల వ్యవస్థతో సకాలంలో సేవలు

- సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల



సత్కారం పొందిన వలంటీర్లతో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు

నెల్లిమర్ల రూరల్: వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు సకాలంలో సేవలు అందుతున్నాయని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు అన్నారు. మండలంలోని ఒమ్మి గ్రామ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ఇళ్ల వద్దే సేవలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రతి చిన్న పనికీ సుదూర ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగేవారని, ప్రస్తుతం వలంటీర్, సచివాలయ వ్యవస్థల వల్ల ఇళ్ల ముంగిటే సేవలు అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్..

పూసపాటిరేగ: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ నిస్వార్థంగా పనిచేసున్న వలంటీర్ల సేవలు భేష్ అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. పూసపాటిరేగ-1, పూసపాటిరేగ - 2 గ్రామాల సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలలో సచివాలయాల ద్వారా వలంటీర్లు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. వలంటీర్లు వేతనం కోసం పనిచేయడం లేదని, సేవా దృక్పథంతో పనిచేస్తున్నారని కొనియాడారు. వలంటీర్ వ్యవస్థ భారతదేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ జి.రామారావు, సర్పంచ్ టొంపల సీతారాం, ప్రజాప్రతినిధి మహంతి శ్రీనివాసరావు, దాడిశెట్టి త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని చిన పూతికవలస గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను అన్ని విధా లా ఆదుకుంటామని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. చినపూతికవలస గ్రామంలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఆరు పూరిళ్లు దగ్ధమైన విషయం తెలుసుకు న్న వెంటనే జెడ్పీ చైర్మన్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అక్కడే ఉన్న ఇన్‌చార్జి తహసీల్దార్ గిరిధర్‌ను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయడంతో పాటు గురువారం నుంచే నిర్మా ణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ రమణమూర్తిని జెడ్పీ చైర్మన్ ఫోన్‌లో ఆదేశించారు. అలాగే బాధితులకు ప్రభుత్వం తరఫున సహాయాన్ని త్వరితగతిన అందేలా నివేదికలు ప్రభుత్వానికి పంపించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సూర్యనారాయణరాజు, స్థానిక నాయకులు ఉన్నారు.

వల్లూరులో పిడుగు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరులో బుధవారం సాయంత్రం ఓ ఇంటిపై పిడుగు పడింది. గ్రామానికి చెందిన కీర్తి సన్యాసి అనే వ్యక్తి ఇంటిపై భారీ శబ్దంతో పిడుగు పడింది. దీంతో శ్లాబు పెచ్చు ఊడి కింద పడింది. అలాగే విద్యుత్ ఉపకరణాలన్నీ పాడయ్యాయి.